సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
బుధవారం । 6 । డిసెంబర్ । 2023



బడోపేతం

ప్రభుత్వం విద్యా రంగంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించే దిశగా అనేక పథకాలు అమలు చేస్తోంది.

8 లో



స్వామియే.. శరణమయ్యప్పా..

అయ్యప్ప స్వామి దీక్ష.. క్రమశిక్షణ వైపు నడిపించే భక్తి మార్గం. కులమతాలకు అతీతంగా భక్తి నియమాలతో సాగే అయ్యప్ప మాలధారణకు ఏటా ప్రాధాన్యం పెరుగుతోంది.

నీటి విడుదల తగ్గింపు



ధవళేశ్వరం: భారీ వర్షాల నేపథ్యంలో మంగళవారం బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు నీటి విడుదలను మరింత తగ్గించారు. తూర్పు డెల్టాకు 300 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. పశ్చిమ డెల్టాకు నీటి విడుదలను పూర్తిగా నిలిపివేశారు.

న్యూస్‌రీల్

జిల్లా సైన్స్ ఫెయిర్‌కు కో ఆర్డినేషన్ కమిటీ

రాయవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఈ నెలలో నిర్వహించనున్న జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు మంగళవారం కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి చైర్మన్‌గా, రామచంద్రపురం ఉప విద్యాశాఖాధికారి ఎస్.ఎల్.నరసింహ కన్వీనర్‌గా, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం కో కన్వీనర్‌గా, మెంబర్లుగా డీసీఈబీ సెక్రటరీ బి.హనుమంతరావు, సమగ్ర శిక్షా ఏఎంవో పి.రాంబాబు, సీనియర్ ఎంఈవో బి.రమణశ్రీ, ఎంఈవోలు ఎం.శ్రీనివాసు, ఎన్.రామచంద్రరావు, పి.షాలెంరాజు, పి.లక్ష్మణమూర్తి, ప్రధానోపాధ్యాయులు పోలిశెట్టి రాంబాబు, ఎం.అంబేడ్కర్, వెంకటరావు, వీర్రాఘవరెడ్డిలను నియమించారు. ఈ నెల మూడవ వారంలో జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను రామచంద్రపురంలో నిర్వహించనున్నారు. విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేయడానికి అవసరమైన ఏర్పాట్లను కమిటీ పర్యవేక్షించనుంది. ఇదిలా ఉంటే పాఠశాల స్థాయిలో ఈ నెల 16న, మండల స్థాయిలో 19న విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించాల్సి ఉంది.

'గెల'గెంత!



అరటి గెలతో రైతు సుబ్బరాజు

ఆత్రేయపురం: ఏడు అడుగుల పొడవు, 23 అత్తాలు, సుమారు 500 పండ్లతో ఆ అరటి గెల అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. పశ్చిమ బెంగాల్ నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ఉచ్చిలికి చేరిన అరుదైన అరటి మొక్కకు ఈ గెల వేసింది. సాధారణంగా గోదావరి జిల్లాల్లో అరటి గెలలు రెండు నుంచి మూడు అడుగులు ఎత్తు ఉంటాయి. గెలకు సుమారు 100 వరకు పండ్లు ఉంటాయి. అభ్యుదయ రైతు భూపతిరాజు వెంకట సత్య సుబ్బరాజు పొలంలో పెరిగిన ఈ మొక్కను బొంత పక్కిస్ అంటారు. పశ్చిమ బెంగాల్ నుంచి నాలుగు మొక్కలు తీసుకు వచ్చి ప్రయోగాత్మకంగా నాటారు. బొంత పక్కిస్ మొక్క కర్పూర రకాన్ని పోలి ఉంటుందని రైతు సుబ్బరాజు తెలిపారు. ఆ గెలను పరిసర ప్రాంతాల రైతులు పరిశీలిస్తున్నారు. ఈ గెలను హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి రూ.1,500కు కొనుగోలు చేసినట్టు తెలిపారు.

ఆగని వాన.. సాగిన సాయం

- తుపాను వేగంతో సహాయ, పునరావాస చర్యలు
- అయినవిల్లిలో రికార్డు స్థాయిలో 20 సెంటీమీటర్ల వర్షపాతం
- నీట మునిగిన వరి చేలు... అన్నదాతల ఆందోళన
- రైతులకు భరోసా కల్పించిన నేతలు, అధికారులు
- బాధితులకు భోజనం... తాగునీటి సదుపాయం



మలికిపురం మండలం కేశవదాసుపాలెంలో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్లను తొలగిస్తున్న సిబ్బంది



అంబాజీపేట మండలం గంగలకుర్రులో నీట మునిగిన వరి చేను



ముమ్మిడివరం మండలం మెర్లపాడులో ఉపాధి హామీ కూలీలతో కాలువలో పూడిక తొలగింపు



కొత్తపేట మండలం పలివెల వద్ద విద్యుత్ సర్వీసు పునరుద్ధరించే పనిలో..

సాక్షి అమలాపురం: ఎడతెరిపిలేని వర్షం... ఆకాశానికి చిల్లు పడినట్టు ఒకటే వర్షం... మిచాంగ్ తుపాను ప్రభావంతో జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారు జాము వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు దఫదఫాలుగా భారీ వర్షం పడుతూనే ఉంది. వర్షాలకు వరి చేలు పెద్ద ఎత్తున నేలనంటి నీట మునిగాయి. మరోవైపు ప్రభుత్వం సహాయ పునరావాస చర్యల వేగం పెంచింది. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అన్నదాతకు అండగా ఉన్నామనే భరోసాను కల్పించారు.

121 మిల్లీమీటర్ల వర్షం

మిచాంగ్ తుపాను వల్ల జిల్లా 48 గంటల పాటు భారీ వర్షాలను చవిచూసింది. కొన్ని సందర్భాలలో కుంభవృష్టిని తలపించే వర్షాలు కురిశాయి. దట్టమైన మేఘాలు కమ్ముకుని పలు సందర్భాలలో పగలే చీకటిని తలపించేటట్టు వాతావరణం మారిపోయింది. జిల్లాలో గత 24 గంటలలో సగటున 121 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అయినవిల్లి మండలంలో రికార్డు స్థాయిలో 199.6 మిల్లీమీటర్లు, అత్యల్పంగా మండపేటలో 39.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సామాన్యులు, చిరు వ్యాపారులు, మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అన్నదాతకు అధికంగా నష్టం వాటిల్లింది. జిల్లావ్యాప్తంగా 1.58 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు చేయగా సుమారు 50 వేల ఎకరాల్లో పంటలను కోయాల్సి ఉంది. తొమ్మిది వేల ఎకరాల్లో వరి చేను నేలకొరిగి నీట మునిగింది. రెండు రోజులపాటు ఏకధాటిగా వర్షం కురవడం వల్ల ఉప్పలగుప్తం, అల్లవరం, కాట్రేనికోన, మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లోని తీర ప్రాంత గ్రామాల్లో వరి చేలల్లో మోకాలు లోతు నీరు చేరింది.

సుడిగాలితో అతలాకుతలం

రాజోలు నియోజకవర్గం మలికిపురం, సఖినేటిపల్లిలో తుపాను ప్రభావంతో సుడిగాలి వీచి స్థానికులను ఆందోళనకు గురి చేసింది. మోరి, వి.వి.మెరకలలో ఇది ప్రభంజనం సృష్టించింది. నిమిషం పాటు స్థానికులను బెంబేలెత్తించింది. మనుషులకు ఎటువంటి ప్రమాదం జరగకున్నా ఆస్తినష్టం సంభవించింది. సుడిగాలి తీవ్రతకు ఇళ్ల మీద రేకులు ఎగిరిపోయాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ స్తంభాలు సైతం విరిగిపడడం గమనార్హం. విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. కొబ్బరి చెట్ల ఆకులు, కొమ్మలు ఆకాశంలో ఎగిరిపడ్డాయి. ఆక్వా చెరువుల గట్ల మీద ఉన్న కొబ్బరి చెట్లు విరిగిపడ్డాయి.

ధైర్యం చెప్పిన మంత్రులు, ఎమ్మెల్యేలు

అల్లవరం మండలం రెల్లుగడ్డలో రాష్ట్ర రవాణా శాఖమంత్రి పినిపే విశ్వరూప్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ ముఖ్యకార్యదర్శి, తుపాను సహాయక చర్యల జిల్లా పర్యవేక్షణాధికారిణి జి.జయలక్ష్మి, కలెక్టర్ హిమాన్షు శుక్లాలు ముంపుబారిన పడిన వరిచేలను పరిశీలించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి విశ్వరూప్ రైతులకు హామీ ఇచ్చారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార, సినిమాటోగ్రఫీ శాఖమంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ కె.గంగవరం మండలంలో పర్యటించి రైతులకు భరోసా ఇచ్చారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్ గాడిలంక, గున్నేపల్లిలోను, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు మామిడికుదురు మండలం నగరంలో పర్యటించి ముంపుబారిన పడిన చేలు, ధాన్యం రాశులను పరిశీలించారు. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ చింతలమోరిలో పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు.

ప్రత్యేకాధికారి జయలక్ష్మి సమీక్ష

తుపాను ప్రభావం ఉన్న ప్రాంతాలలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ ముఖ్యకార్యదర్శి, తుపాను సహాయక చర్యల జిల్లా పర్యవేక్షణాధికారి జి.జయలక్ష్మి అధికారులకు సూచించారు. మంత్రి విశ్వరూప్, కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ ద్వారా తుపాను ప్రభావాన్ని తెలుసుకున్నారు. ఖరీఫ్ ధాన్యం సేకరణ మానిటరింగ్ విధానాన్ని ఆమె పరిశీలించారు. రైతులకు నష్టం వాటిల్లకుండా కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే మిల్లర్ల ద్వారా కొనుగోలు చేయించేలా చూడాలన్నారు. ట్రక్కు జనరేషన్, మిల్లర్ల ఎకనాలజీమెంటు, జీపీఎస్, కస్టోడియన్ అధికారుల పనితీరు, తేమ శాతం ఎఫ్ఎక్యూ ప్రమాణాలు, ఈకేవైసీ, ఆర్డర్ జనరేషన్‌ను ఆమె పరిశీలించారు.

ముమ్మరంగా సహాయక చర్యలు

భారీ వర్షాలకు వరి చేలు నీట మునిగి ఇబ్బంది పడుతున్న రైతులకు మేలు చేసేలా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) కూలీలను వినియోగిస్తున్నారు. నీట మునిగిన వరి పొలాలలోని పనలు గట్ల మీదకు చేర్చడం, ముంపు నీటిని కాలువలలోకి మళ్లించడం, మురుగునీటి కాలువలలో తూడు, గుర్రపుడెక్క తొలగింపు వంటి పనులు వేగంగా చేపట్టారు. ఎంపీడీవోల ఆధ్వర్యంలో జిల్లాలో పలుచోట్ల ఈ పనులు చేపట్టారు. గ్రామాలలో మూసుకుపోయిన డ్రెయిన్లలో పూడిక తొలగింపు పనులు చేపట్టారు. కాట్రేనికోన, ముమ్మిడివరం, అల్లవరం, ఉప్పలగుప్తం, అమలాపురం మండలాల్లో ఈ పనులు అధికంగా చేపట్టారు.

- గాలులకు రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్లను తొలగిస్తున్నారు. తెగిన విద్యుత్ లైన్లను తిరిగి పునరుద్ధరించడంతోపాటు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకుండా చర్యలు చేపట్టారు. సుడిగాలి బీభత్సం సృష్టించిన సఖినేటిపల్లి మోరి, వి.వి.మెరకతోపాటు కొత్తపేట మండలం పలివెల వద్ద విద్యుత్ సరఫరా పనులు వేగంగా చేశారు.

37 పునరావాస కేంద్రాల్లో 910 మందికి ఆశ్రయం జిల్లాలో తొమ్మిది మండలాల పరిధిలోని 41 గ్రామాలు భారీ వర్షాల బారిన పడ్డాయి. 37 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసిన జిల్లా యంత్రాంగం వాటి ద్వారా 910 మంది ప్రజలకు ఆశ్రయం కల్పించింది. వీరికి భోజన సదుపాయంతోపాటు తాగునీరు అందించారు. కలెక్టరేట్‌తోపాటు అమలాపురం, కొత్తపేట, రామచంద్రపురం ఆర్డీవో కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు కొనసాగుతున్నాయి. 62 పక్కా ఇళ్లు, 48 పూరిళ్లు దెబ్బతిన్నాయి.

వర్షపాతం ఇలా..

జిల్లాలో అయినవిల్లి మండలంలో 199.6 మి.మీటర్ల వర్షం కురవగా, ఉప్పలగుప్తం 195.2, కాట్రేనికోన 177.6, అమలాపురం 175.4, ముమ్మిడివరం 167.6, ఐ.పోలవరం 156.2, కొత్తపేట 149.2, రావులపాలెం 141.4, అంబాజీపేట 137.6, కపిలేశ్వరపురం 132.2, కె.గంగవరం 124, ఆలమూరు 115.4, రాజోలు 96.4, ఆత్రేయపురం 90.6, సఖినేటిపల్లి 87.6, రామచంద్రపురం 87.2, అల్లవరం 85.2, మలికిపురం 84.2, మామిడికుదురు 79.2, పి.గన్నవరం 77.2, రాయవరం 64.6, మండపేటలో 39.4 మి.మీటర్ల వర్షం కురిసింది. ఉదయం ఎనిమిది గంటల తరువాత కూడా జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం కురుస్తూనే ఉంది.

నేడు పాఠశాలలకు సెలవు

రాయవరం: మిచాంగ్ తుపాను ప్రభావంతో బుధవారం కూడా పాఠశాలలకు సెలవు ప్రకటించారు. జిల్లాలో 1,579 ప్రభుత్వ, 456 ప్రైవేట్ పాఠశాలలు మూతపడనున్నాయి. ఈదురుగాలులు, భారీ వర్షాల కారణంగా ఈ నెల 4, 5 తేదీల్లో కూడా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవు ప్రకటించారు. తుపాను ప్రభావం ఇంకా వీడకపోవడంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా బుధవారం కూడాకలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాలతో పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు డీఈవో ఎం.కమలకుమారి తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలు కూడా తప్పనిసరిగా ఆదేశాలు పాటించాలని, ఎవరైనా పాఠశాలలు తెరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు

కళాశాలలకు కూడా..

తుపాను ప్రభావంతో జూనియర్ కళాశాలల విద్యార్థులకు బుధవారం సెలవు ప్రకటించినట్లు ఇంటర్ బోర్డు డీవీఈవో ఎస్‌వీవీ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న 13 ప్రభుత్వ, ఒక ఎయిడెడ్, 86 ప్రైవేట్ జనరల్, 36 ప్రైవేట్ ఒకేషనల్ కళాశాలలకు సెలవు ప్రకటించారన్నారు.

సుడిగాలి బీభత్సం

- 41 కొబ్బరిచెట్లు, 2 తాటాకు పాకలు, 2 గడ్డిమేట్లు ధ్వంసం
- తడిసిపోయిన 18 ఎకరాల ధాన్యం రాసులు, 10 బస్తాల ధాన్యం



అవిడిలో ధాన్యం రాసులపై బరకాలు కప్పుతున్న రైతులు

కొత్తపేట: మండల పరిధిలోని అవిడి రేవడి ప్రాంతంలో తుపాను సుడిగాలి బీభత్సం సృష్టించింది. అవిడి – గంటి పెదపూడి రోడ్డులో కట్వలాంభిక ఆలయం సమీపంలో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా సుడిగాలి వ్యాపించింది. ఆ గాలికి రెండు పెద్ద తాటాకు పాకలు, రెండు గడ్డిమేట్లు ఎగిరిపోయాయి. 41 కొబ్బరి చెట్లు విరిగిపోయాయి. 18 ఎకరాల విస్తీర్ణంలో మాసూలు చేసిన ధాన్యం రాసులు, 10 సంచుల్లో పట్టి నెట్టి కట్టిన ధాన్యంపై కప్పిన బరకాలు ఎగిరిపోయి ఆ ధాన్యం తడిసిపోయింది. ఈ సమాచారం తెలిసిన వెంటనే తహసీల్దార్ జీడీ కిషోర్‌బాబు, ఆర్ఐ కొప్పిశెట్టి ఏడుకొండలు, వీఆర్‌ఓ వంగర శ్రీను ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. రోడ్డుకు అడ్డంగా పడిన కొబ్బరి చెట్లను జేసీబీతో తొలగించారు. ఈ విషయాన్ని రెవెన్యూ, జిల్లా అధికారులకు నివేదించారు. జరిగిన నష్టాన్ని నమోదు చేయాలని తహసీల్దార్ రెవెన్యూ సిబ్బందికి సూచించారు.

రైతులను ఆదుకుంటాం

మంత్రి పినిపే విశ్వరూప్



అల్లవరంలో వరి పొలాలను పరిశీలిస్తున్న మంత్రి విశ్వరూప్, జిల్లా ప్రత్యేకాధికారి, కలెక్టర్

అల్లవరం: మిచాంగ్ తుపాను ప్రభావంతో పంట నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ భరోసా ఇచ్చారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి, జిల్లా ప్రత్యేకాధికారి జి.జయలక్ష్మి, కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలసి అల్లవరంలో వరి పొలాలను మంత్రి మంగళవారం పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ రైతులెవరూ అధైర్య పడవద్దన్నారు. తడిసిన, రంగు మారిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వమే గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తుందన్నారు. రెండు రోజులుగా ఈదురు గాలులతో కూడిన కురుస్తున్న భారీ వర్షాలకు కోనసీమ జిల్లాలో తొమ్మిది వేల ఎకరాల వరి పంట ముంపు బారిన పడిందన్నారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి నీటి మునిగిన వరి దుబ్బులను నిలబెట్టి కట్టే ప్రయత్నం చేసి నష్ట నివారణ చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా వ్యాప్తంగా 1.65 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా 1.05 లక్షల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయన్నారు. 50 వేల ఎకరాల్లో కోయవలసి ఉందన్నారు. జిల్లా ప్రత్యేకాధికారి జయలక్ష్మి మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ రెండేళ్లుగా జిల్లా వ్యాప్తంగా ఉన్న డ్రెయిన్ల ఆధునీకరణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ముంపు నీరు ఎస్.రామేశ్వరం మొగ నుంచి సముద్రానికి చేరుతోందని చెప్పారు. వీరి వెంట డ్వామా పీడీ మధుసూధన్, ఆర్డీఓ కేశవ వర్ధన్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి కె.మూర్తి, డ్రెయిన్స్ ఈఈ కిషోర్, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, సర్పంచ్ బి.బాలవేణి ఉన్నారు.

అన్నదాతలు ఆందోళన చెందొద్దు

మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ



పామర్రులో పొక్లెయిన్‌తో రోడ్డుకు గండి కొట్టి నీటిని మళ్లింపు చేయిస్తున్న మంత్రి వేణు

కె.గంగవరం: తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్నదాతలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ అన్నారు. మండల పరిధిలోని పామర్రు, దంగేరు గ్రామాల్లో మంగళవారం నీటమునిగిన పంట పొలాలు, ధాన్యం రాసులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేమ శాతంతో సంబంధం లేకుండా ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. దీంతోపాటు ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోలు చేస్తారని, రైతులు దగ్గర్లో ఉన్న మిల్లులకు ధాన్యాన్ని పంపించాలన్నారు. ప్రస్తుతం రెండు రకాలుగా ధాన్యం ఉందన్నారు. పొడి ధాన్యాన్ని మామూలు రైస్ మిల్లుకు, తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్‌మిల్లులకు పంపించే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఏ రైతు నష్టపోకుండా గిట్టుబాటు ధరకే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు.

రైతులకు అండగా..

పామర్రు ఉన్నత పాఠశాల గ్రౌండులో రెండు గ్రామాల ప్రజలు సుమారు 200 టన్నుల ధాన్యం రాసులపై బరకాలు కప్పి ఉంచారు. వర్షం కారణంగా మొత్తం రాసులన్నీ నీట మునిగాయి. సమాచారం తెలుసుకున్న మంత్రి వేణు గ్రామానికి వచ్చి రైతులకు అండగా నిలిచారు. పొక్లెయిన్‌తో రోడ్డుకు గండి కొట్టించి పక్కనే ఉన్న పంట కాలువలో నిలిచి పోయిన వర్షపు నీరు పోయే విధంగా చర్యలు తీసుకున్నారు. మొత్తం ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఆర్డీఓ ఎస్.సుధాసాగర్, తహసీల్దార్ వైద్యనాథ్ శర్మ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బంగారుకొండ.. భవితకు అండ



చిన్నారికి బంగారుకొండ పోషకాహార కిట్‌ను అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత (ఫైల్)

- కలెక్టర్ ఆలోచనకు సత్ఫలితాలు
- సాధారణ స్థితికి 478 మంది పిల్లలు
- కొత్తగా 38 మంది గుర్తింపు

రాజమహేంద్రవరం రూరల్: చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని అధిగమించి, ఆరోగ్యవంతులు చేసేందుకు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత రూపొందించిన బంగారుకొండ కార్యక్రమం సత్ఫలితాలను ఇచ్చింది. వయసుకు తగిన బరువు, ఎత్తు లేని ఆరేళ్ల లోపు చిన్నారులను గుర్తించి, వారికి ఆరునెలల పాటు 8 రకాల పోషకాహారం అందించాలన్నదే కార్యక్రమం ఉద్దేశం. ఈ ఏడాది జూన్ 14న హోంమంత్రి తానేటి వనిత, ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభమైంది.

1,283 మంది గుర్తింపు

తీవ్ర బలహీనంగా, తక్కువ బరువు, వయసుకు తగిన ఎత్తు, సరైన ఎదుగుదల లేని 1,283 మందిని కలెక్టర్ నేతృత్వంలో ఐసీడీఎస్ సిబ్బంది గుర్తించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ, గోరుముద్ద పథకాల ద్వారా అందిస్తున్న పోషకాహారంతో పాటు అదనంగా ఎనిమిది రకాల పోషకాహారాన్ని అందించనున్నారు. కలెక్టర్ మాధవీలత ఈ ఆలోచనకు జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, జిల్లా ఉన్నతాధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ముందుకువచ్చారు. ఆరు నెలల పాటు నెలకు రూ.500 విలువైన ఎనిమిది రకాల పోషకాహార కిట్లను పంపిణీ చేసేందుకు రూ.3 వేలు అందించేందుకు ముందుకు వచ్చారు. పోషకాహార కిట్లకు సహకరించిన దాతలకు బాలమిత్రలుగా నామకరణం చేశారు.

వైద్యుల పర్యవేక్షణ

బాలమిత్రలు ఒక్కొక్క చిన్నారిని దత్తత తీసుకుని ప్రతి బుధవారం వారింటికి వెళ్లి ఆ చిన్నారి బరువు, ఎత్తు తూయడంతో పాటు బంగారుకొండ యాప్‌లోనూ, వెబ్‌సైట్‌లోనూ వివరాలు నమోదు చేసేవారు. దీనిద్వారా ఆ చిన్నారుల ఎత్తు, బరువుల్లో మార్పులు వస్తున్నాయా, లేదా అన్న విషయాన్ని గుర్తించడంతో పాటు వైద్యసేవలు అవసరమైతే సంబంధిత వైద్యాధికారులు పరీక్షలు చేసి మందులను ఇస్తారు. పిల్లలను లోప పోషణ స్థితి నుంచి సాధారణ స్థితికి వచ్చే వరకూ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేస్తారు.

సాధారణ స్థితికి 478 మంది

బంగారుకొండ కార్యక్రమాన్ని ప్రారంభించి ఐదు నెలలు పూర్తయ్యింది. 1,283 మంది చిన్నారుల్లో ఇప్పటి వరకు 478 మంది సాధారణ స్థితికి వచ్చారు. మిగిలిన చిన్నారుల్లో కొంతమందిలో ఆరోగ్య సమస్యలు ఉండడం వల్ల బాలమిత్రలతో పాటు నిరంతరం ఏఎస్ఎం, అంగన్‌వాడీ కార్యకర్త, సూపర్ వైజర్ పర్యవేక్షణ చేస్తున్నారు. జిల్లాలో వీరితో పాటు మరో 38 మంది పోషకాహార లోపం, వయసుకు తగిన బరువు, ఎత్తు లేని పిల్లలను గుర్తించారు.

విజయవంతం



జిల్లాలో ప్రయోగాత్మకంగా చేపట్టిన బంగారుకొండ కార్యక్రమం ద్వారా ఐదు నెలల వ్యవధిలో తీవ్ర పౌష్టికాహార లోపం, ఎదుగుదల లోపం ఉన్న 1,283 మంది చిన్నారుల్లో 478 మంది సాధారణ స్థితికి రావడం చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంతో పాటు అదనపు ఆహారం అందిస్తున్నాం. జిల్లాలో మరో 38 మందిని గుర్తించాం. బాలమిత్రలుగా మరింతమంది దాతలు ముందుకు రావాలి. జిల్లా అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అందరి సహకారంతో బంగారుకొండ కార్యక్రమం విజయవంతమైంది.

– డాక్టర్ కె.మాధవీలత, కలెక్టర్

నిరంతరం పర్యవేక్షణ



బంగారుకొండ కార్యక్రమంలో బాలమిత్రలు దత్తత తీసుకున్న చిన్నారులపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. ప్రతి బుధవారం బాలమిత్రలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎస్ఎంలు వెళ్లి పిల్లల బరువును తూచి, ఎత్తును కొలిచి యాప్‌లో, వైబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నారు. పౌష్టికాహార లోపం ఉన్న పిల్లల్లో చాలామందికి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ సమస్యలకు సంబంధించి స్పెషలిస్టు వైద్యులతో పరీక్షలు చేయించి, ఆ చిన్నారి ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటున్నాం.

– కె.విజయ కుమారి, జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ సాధికారిత అధికారి

సంతోషంగా ఉంది



మా అబ్బాయి కొక్కిరపాటి వరుణ్ కుమార్ వయసు మూడేళ్లు. 87 సీఎం ఎత్తు, 10.4 కిలోల బరువు ఉండేవాడు. హోంమంత్రి తానేటి వనిత నా కుమారుడిని దత్తత తీసుకుని బంగారుకొండ పౌష్టికాహార కిట్‌ను ప్రతినెలా అందిస్తున్నారు. పోషకాహారం తీసుకున్న తరువాత 92 సీఎం ఎత్తు, 11.7 కిలోల బరువుకు వచ్చాడు. చాలా సంతోషంగా ఉంది.

– కొక్కిరపాటి సునీత, దొమ్మేరు

కొండంత భరోసా



మా అబ్బాయి చాకలి భవ్యేష్ అభ్యంత్ వయసు ఏడాదిన్నర. బంగారుకొండ కార్యక్రమం మొదలుపెట్టిన జూలైలో బరువు 7.8 కిలోలు, ఎత్తు 74 సీఎం ఉండేవాడు. ఇప్పుడు బరువు 8.4 కిలోలు, ఎత్తు 77 సీఎం పెరిగాడు. పోషకాహారం తీసుకోవడం వల్ల మా అబ్బాయి పెరుగుదల బాగుంది. బంగారుకొండ కిట్లు ఇవ్వడంతో పాటు బాలమిత్ర, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎస్ఎం నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. – చాకలి లీలాకుమారి, రాజానగరం

ఆరోగ్యం మెరుగైంది



మా అబ్బాయి గొందేశి పవన్ తేజకు ఐదేళ్ల వయసు. మొదట బరువు 15.3 కిలోలు, ఎత్తు 99 సీఎం ఉండేవాడు. పోషకాహారం తీసుకున్న తరువాత బరువు 17.3 కిలోలు, ఎత్తు 102 సీఎంకి పెరిగాడు. బంగారుకొండ పోషకాహారం తీసుకున్న తరువాత ఆరోగ్యంగా, హుషారుగా ఉంటున్నాడు. ప్రతి బుధవారం బాలమిత్ర, ఏఎస్ఎం, అంగన్‌వాడీ కార్యకర్త పర్యవేక్షిస్తున్నారు.

– గొందేశి మహాలక్ష్మి, గణేష్ దంపతులు, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

జోనల్ స్థాయి బాక్సింగ్ పోటీలకు పృథ్వీరాజ్


బాక్సింగ్ పోటీల్లో విజేతగా నిలిచిన పృథ్వీరాజ్

కొత్తపేట: స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి సీహెచ్ పృథ్వీరాజ్ జోనల్ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే పెద్దిరాజు తెలిపారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలో ఇంటర్ కాలేజియేట్ అండ్ ఇంటర్ యూనివర్సిటీ టీమ్ సెలెక్షన్స్ 2023–24 లో భాగంగా ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సోమవారం మెన్ అండ్ ఉమెన్ బాక్సింగ్ పోటీలు నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ పోటీల్లో బీకాం ఫైనల్ ఇయర్ చదువుతున్న పృథ్వీరాజ్ ఉత్తమ ప్రతిభ కనపరిచి, చండీఘడ్ స్టేట్ మొహాలీ యూనివర్సిటీలో ఈ నెల 25 నుంచి 30 వరకూ జరగనున్న జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. పృథ్వీరాజ్‌ను ప్రిన్సిపాల్, పీడీ కె.కనకరాజు, అధ్యాపకులు అభినందించారు.

ఆల్ ఇండియా బాడ్మింటన్‌లో రన్నర్‌గా అభిషేక్


ట్రోఫీని అందుకున్న అభిషేక్

రామచంద్రపురం: యోనెక్స్–సన్ రైజ్ ఆల్ ఇండియా సబ్ జూనియర్ ర్యాంకింగ్ బాడ్మింటన్ టోర్నమెంట్ –2023లో తమ విద్యార్థి బోను అభిషేక్ అండర్ –15 డబుల్స్ కేటగిరీలో రన్నర్‌గా నిలిచినట్లు మోడరన్ విద్యాసంస్థల అధినేత జి.వి.రావు మంగళవారం విలేకరులకు తెలిపారు. బెంగళూరు వేదికగా కర్ణాటక బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవంబర్ 28 నుంచి డిసెంబర్ 5 వరకు ఈ టోర్నీ జరిగిందన్నారు. అభిషేక్ రూ.15,000 నగదు పురస్కారంతో పాటు ప్రముఖుల చేతుల మీదుగా ట్రోఫీ తీసుకున్నాడన్నారు. స్కూల్ అకడమిక్ డైరెక్టర్ శ్రీమతి ఆర్.ఉమాదేవి, హెచ్.ఎం.ముత్యాల చిట్టిబాబు అభినందనలు తెలియజేశారు.

బడోపేతం

- జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో విస్తృతంగా తనిఖీలు
- నాణ్యమైన విద్య, వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి

రాయవరం: ప్రభుత్వం విద్యా రంగంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించే దిశగా అనేక పథకాలు అమలు చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో భారీ ఎత్తున మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం విద్యార్థుల అభ్యసనా స్థాయిలకు అనుగుణంగా విద్యను అందించేందుకు పర్యవేక్షణను పటిష్టం చేయడం ద్వారా పాఠశాలలను బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఉపాధ్యాయులు సకాలంలో సిలబస్ పూర్తి చేయడం, పరీక్షల నిర్వహణ, విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందాయా? లేదా? మధ్యాహ్న భోజనం సక్రమంగా అందుతోందా? లేదా? తదితర విషయాలను పరిశీలించేందుకు కమిటీలను ఏర్పాటు చేశారు.

వివరాలు ఇలా..

జిల్లా	ప్రభుత్వ/ఎయిడెడ్ పాఠశాలలు	విద్యార్థులు	ప్రైవేట్ పాఠశాలలు	విద్యార్థులు
తూర్పు	1,011	2,12,269	553	1,44,657
కోనసీమ	1,579	1,10,177	456	1,13,894
కాకినాడ	1,285	1,71,338	574	1,33,732

పక్కాగా పర్యవేక్షణ చేసేలా

అదే మండలంలోని ఎంఈవోలతో పర్యవేక్షణ చేయడం ద్వారా ఆశించిన ఫలితాలు రావనే ఉద్దేశంతో విద్యాశాఖ వినూత్నంగా ఆలోచన చేసింది. జిల్లా విద్యాశాఖాధికారి, ఉప విద్యాశాఖాధికారితో పాటుగా, సమగ్ర శిక్షా సెక్టోరియల్ అధికారులు, మండల విద్యాశాఖాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు ఇప్పటికే పాఠశాలలను నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. ఒక మండలంలోని ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలను పక్క మండలంలో నియమించి, వారితో పాఠశాలలను తనిఖీ చేయిస్తున్నారు. ఇలా చేయడం ద్వారా వాస్తవ పరిస్థితి తెలుస్తుందని జిల్లా విద్యాశాఖ భావిస్తోంది. అందుకనుగుణంగా ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలను పర్యవేక్షణ కమిటీల్లో నియమించారు. పాఠశాలల్లో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, విద్యాబోధన ఏ విధంగా ఉంది? ఉపాధ్యాయుల పనితీరుపై కమిటీల నివేదికలను జిల్లా విద్యాశాఖకు అందజేయనున్నాయి. తనిఖీల అనంతరం గుర్తించిన లోపాలతో కమిటీలు ఇచ్చే నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నారు. ఈ నిర్ణయంతో పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని పలువురు భావిస్తున్నారు.

మండలానికి ఇద్దరు ఎంఈవోలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను సుందరీకరించి, ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేసి, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా వసతులు కల్పించింది. ఇంగ్లిష్ మీడియంను పరిచయం చేయడంతో పాటు వర్చువల్ విధానంలో విద్యాబోధనకు కృషి చేస్తోంది. టోఫెల్ విధానంలో పరీక్షలు నిర్వహించింది. 8వ తరగతిలోనే విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ చేసింది. విద్యావ్యవస్థను పటిష్టం చేసే చర్యల్లో భాగంగా, విద్యాపరమైన కార్యక్రమాలను పర్యవేక్షణ చేయడానికి మండలానికి ఇద్దరు ఎంఈవోలను నియమించింది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అకడమిక్ క్యాలండర్ పకడ్బందీగా అమలు చేసేందుకు ఎంఈవోలను నియమించింది.


పాఠశాలల్లో తనిఖీలు చేపడుతున్న ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు

విద్యాశాఖ ఉత్తర్వుల ప్రకారం



జిల్లా విద్యాశాఖ ఉత్తర్వుల ప్రకారం ఎంఈవోలు, పక్క మండలంలోని పాఠశాలల్లో తనిఖీలు చేపడుతున్నాం. కార్యక్రమాల అమలు తీరు, విద్యార్థుల విద్యా ప్రమాణాలు తెలుసుకునేందుకు ఈ తనిఖీలు చేస్తున్నాం. ఈ తనిఖీల్లో గుర్తించిన అంశాలను నివేదిక రూపంలో జిల్లా విద్యాశాఖాధికారికి అందజేయనున్నాం.

– మట్టపర్తి హరిప్రసాద్, ఎంఈవో, కొత్తపేట

వాస్తవ పరిస్థితి తెలుస్తుందనే..



ప్రతి విద్యార్థి చదువుతున్న తరగతికి సంబంధించిన అభ్యసన సామర్థ్యాలను సాధించాల్సి ఉంది. తనిఖీల ద్వారా క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితి తెలుస్తుంది. విద్యా ప్రమాణాల మెరుగు పర్చేందుకు ఈ చర్యలను తీసుకున్నాం. తనిఖీల అనంతరం ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేస్తాం.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

వ్యక్తిపై హత్యాయత్నం


బాధితుడు దుర్గాప్రసాద్ నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేస్తున్న ఎస్సై సాగర్

కొత్తపేట: ఒక యువతితో యువకుడు అసభ్యంగా మాట్లాడిన వివాదం ఒక వ్యక్తిపై హత్యాయత్నానికి దారితీసింది. ఈ వివాదంలో పింద్రాళ్ల దుర్గాప్రసాద్‌ను పింద్రాళ్ల చిన్నయ్య అనే యువకుడు చాకుతో పొడిచి గాయపరిచాడు. స్థానిక ఎస్సై జ్వాలాసాగర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపేట మండలం పలివెల గ్రామానికి చెందిన పింద్రాళ్ల దానయ్యతో పాటు అతని కుమార్తె, బంధువులు ఈ నెల 3న గ్రామంలోని వరి చేలో గడ్డి పనికి వెళ్లారు. అక్కడ పింద్రాళ్ల చిన్నయ్య.. దానయ్య కుమార్తెతో అసభ్యంగా మాట్లాడాడు. ఆ విషయాన్ని ఆమె తన తండ్రికి చెప్పగా దానయ్య, చిన్నయ్యను నిలదీయడంతో గొడవ జరిగింది. చిన్నయ్య, దానయ్యను కొట్టి గాయపరిచాడు. ఈ గొడవ గురించి మంగళవారం పెద్దల సమక్షంలో తగవు పెట్టారు.

దానయ్య అన్న కుమారుడు పింద్రాళ్ల దుర్గాప్రసాద్ తన చిన్నాన్న తరపున 3వ తేదీన జరిగిన గొడవ గురించి పెద్దలకు చెబుతుండగా చిన్నయ్య కేకలు వేస్తూ తనతో తెచ్చుకున్న కూరగాయలు కోసే చాకుతో దుర్గాప్రసాద్ పొట్టలో పొడిచి తీవ్రంగా గాయపరిచాడు. వెంటనే అక్కడున్న అతనిని బంధువులు కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స జరిపి, ఉన్నత వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడు దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై జ్వాలాసాగర్ తెలిపారు.

అనారోగ్యం, అప్పుల బాధతో ఆత్మహత్య



రామచంద్రపురం రూరల్: మండలంలోని చోడవరానికి చెందిన రైతు రెడ్డి ఏడుకొండలు(60) అనారోగ్యం, అప్పుల బాధతో గత నెల 28న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు రామచంద్రపురం ఎస్సై డి.సురేష్ బాబు మంగళవారం విలేకరులకు తెలిపారు. గడ్డి మందు సేవించిన రైతును తొలుత రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. మంగళవారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు మృతదేహం అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. ఆసుపత్రి సమాచారం, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇంట్లో చోరీ

30 కాసుల బంగారు ఆభరణాలు, రూ.1.50 లక్షల నగదు అపహరణ


వలసపాకలలో చోరీ జరిగిన ఇంట్లో పరిశీలన చేస్తున్న డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, సీఐ మురళీకృష్ణ

కాకినాడ రూరల్: మండలంలోని వలసపాకల గ్రామంలో గానుగుచెట్టు ఇంటి వద్ద సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తిరగటి వీరభద్రరావు ఇంట్లో చోరీ జరిగింది. తుపాను కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండడంతో సోమవారం మధ్యాహ్నం భార్యతో కలిసి దగ్గరలోని గుడారిగుంటలో అత్తారింటికి వెళ్ళాడు. తిరిగి మంగళవారం ఉదయం వచ్చే సరికి ఇంటి తాళాలు పగలగొట్టి లోపల ఉన్న విలువైన బంగారు ఆభరణాలు, నగదు చోరీ అయినట్టు గుర్తించి సర్పవరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సర్పవరం సీఐ మురళీకృష్ణ చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో క్రైమ్ డీఎస్పీ రాంబాబు, లా అండ్ ఆర్డర్ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపారు. కేసు నమోదు చేశామని సీఐ మురళీకృష్ణ తెలిపారు. సుమారు 30 కాసుల బంగారు ఆభరణాలు, రూ.1.50 లక్షల నగదు చోరీ అయినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు.

10 న కాంట్రాక్ట్- ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల మహాసభ


మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

అమలాపురం రూరల్: ఏపీ అమరావతి కాంట్రాక్ట్- ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘ ప్రథమ మహాసభను ఈ నెల 10వ తేదీన విజయవాడలో నిర్వహిస్తున్నట్టు సంఘ కోనసీమ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి.శ్రీనివాస్, గంటి చిరంజీవి తెలిపారు. ఈదరపల్లి అంబేడ్కర్ భవనంలో మంగళవారం జరిగిన సమావేశంలో మహాసభ పోస్టర్ ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న లక్షలాది మంది కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి మెరుగైన జీతభత్యాలు,వైద్యం, ఆర్థిక,ఆర్థికేతర సమస్యల పరిష్కారం కోసం మహాసభను జరుపుతున్నామమని అన్నారు. జిల్లా కార్యదర్శి హరినారాయణ, ఔట్ సోర్సింగ్ రాష్ట్ర నాయకులు సుమన్,నాని,కాశీ,రంగబాబు,గురునాథం జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

స్వామియే.. శరణమయ్యప్పా..

- ఏటా పెరుగుతున్న అయ్యప్ప దీక్షధారులు
- కఠిన నియమాలు ఆచరిస్తూ నిష్ఠగా కొనసాగింపు
- వెల్లివిరుస్తున్న ఆధ్యాత్మికత
- ఆరోగ్యం.. వ్యక్తిత్వ వికాసానికీ దోహదం


పడిపూజకు అందంగా తీర్చిదిద్దిన మంటపం


పడిపూజ చేస్తున్న అయ్యప్ప స్వాములు

రాయవరం/కొత్తపల్లి: అయ్యప్ప స్వామి దీక్ష.. క్రమశిక్షణ వైపు నడిపించే భక్తి మార్గం. కులమతాలకు అతీతంగా భక్తి, నియమాలతో సాగే అయ్యప్ప మాలధారణకు జిల్లాలో ఏటా ప్రాధాన్యం పెరుగుతోంది. కఠిన నియమాలు ఉంటాయని తెలిసి కూడా.. జ్యోతిస్వరూపుడిగా భావించే అయ్యప్ప స్వామి దీక్ష తీసుకునేందుకు భక్తులు ముందుకు వస్తున్నారు. నాలుగు దశాబ్దాల కిందట జిల్లాలో కేవలం వందల సంఖ్యలో స్వాములు మాలధారణ చేస్తే నేడు ఆ సంఖ్య 50 వేల వరకూ ఉందని అంచనా. హరిహరులకు ఎంతో ప్రీతికరమైన కార్తిక మాసంలో మాల ధరిస్తున్నారు.

వాస్తవానికి మలయాళ మాసం వృశ్చిక సంకలనం (నవంబర్ 16) నుంచి జనవరిలో మకర సంక్రాంతి వరకూ అయ్యప్ప దీక్షా సమయంలో శబరిమలలోని అయ్యప్ప ఆలయాన్ని తెరుస్తారు. ఆ రోజు నుంచి దీక్షల స్వీకరణ ప్రారంభమవుతుంది. శబరిమల సన్నిధానంలో జనవరి 1 నుంచి 20 వరకూ మకర విలక్కు (మకర జ్యోతి ఉత్సవం) నిర్వహిస్తారు. జ్యోతి దర్శనానికి వెళ్లే స్వాములు కార్తిక పౌర్ణమి, ఆ తర్వాత రెండు మూడు రోజుల వరకూ మాలలు వేసుకుంటారు. సంక్రాంతి రోజున జ్యోతి దర్శనం చేసుకుని దీక్ష విరమిస్తారు.

పీఠం ఏర్పాటు ఇలా..

మాల ధరించాక మండల దీక్ష పూర్తి చేసేందుకు ఇంట్లో స్థలం ఉంటే అక్కడే పీఠం ఏర్పాటు చేసుకోవాలి. లేకుంటే స్వాములందరూ కలసి సామూహికంగా పీఠం ఏర్పాటు చేసుకోవచ్చు. మండల దీక్ష కోసం సంకల్పం తీసుకుని కలశ స్థాపన చేసి, పీఠంపై ఒకసారి దేవతామూర్తుల చిత్రపటాలు ప్రతిష్ఠించాక.. 41 రోజుల దీక్ష ముగిసే వరకూ దానిని కదిపేందుకు వీలుండదు.

నియమాల తోరణం

- అయ్యప్ప స్వామి దీక్ష తీసుకున్న వారు నల్లటి వస్త్రాలు ధరించాలి. శనిదేవుని చూపు స్వాములపై పడకూడదని ఇలా చేస్తారు. నలుపు ఆకర్షణకు దూరంగా ఉంటుంది. నలుపు రంగు ఉష్ణాన్ని గ్రహించడం వల్ల శీతాకాలంలో స్వాములు చలిని తట్టుకోగలుగుతారు.
- చలి కాలమైనప్పటికీ తట్టుకుంటూ మండల కాలం (41 రోజులు) చన్నీటి స్నానమే చేయాలి.
- భూతల శయనం (నేలపై నిద్రించడం).
- ఏకభుక్తం (ఒక్క పూటే ఆహారం భుజించడం). భిక్షాటన చేసిన బియ్యంతోనే స్వాములు వండుకోవాలి. నేటి రోజుల్లో అలా చేసేందుకు వీలు లేక ఇంట్లో తల్లో, జీవిత భాగస్వామో, తోటి స్వాములో భిక్ష వండుతున్నారు. ఉల్లి, వెల్లుల్లి లేకుండా సాత్విక ఆహారం తీసుకోవాలి.
- ఇలా 41 రోజుల మండల దీక్ష పూర్తయ్యాక స్వాములు ఇరుముడి కట్టుకుని శబరికొండకు పయనమవుతారు.
- మండల కాలంలో స్వాములు ఎటువంటి భేదభావం లేకుండా కలసిమెలసి ఉండాలి.
- అందరూ ఒక్కటేనని చాటి చెప్పే అయ్యప్ప దీక్షలో ఎదురుపడిన స్వాములు ఒకరికొకరు పాద పూజ చేసుకుంటారు. ప్రతి ఒక్కరిలో స్వామి ఉన్నాడనే విశ్వాసంతో ఈ పాద పూజలు చేస్తారు.

అయ్యప్ప చరిత్ర

హరిహర సుతుడు, మణికంఠుడిగా పిలిచే అయ్యప్ప పూజా సంప్రదాయం దక్షిణ భారతదేశంలోనే ఎక్కువగా కనిపిస్తుంది. అయ్య (విష్ణువు), అప్ప (శివుడు) అనే పేర్ల సంగమంతో అయ్యప్ప నామం పుట్టింది. మహిషి అనే రాక్షసిని చంపిన అయ్యప్ప ప్రస్తుత కేరళ రాష్ట్రంలోని శబరిమలలో వెలసినట్టు పురాణాలు చెబుతున్నాయి.

ఇరుముడిధారులకే ఆ అర్హత

దీక్షలో ఇరుముడికి ప్రత్యేకత ఉంది. మండల దీక్ష తీసుకున్న స్వాముల శబరిమల ప్రయాణంలో మొదటి ఘట్టం ఇరుముడి. ఇరుముడి కట్టుకునే అయ్యప్ప స్వామి వేకువజామున ఇంటి గుమ్మం వద్ద కొబ్బరికాయ కొట్టి ఎవ్వరితోనూ మాట్లాడకుండా నేరుగా ఆలయానికి వెళ్లి గురుస్వామితో ఇరుముడి కట్టించుకుంటారు. ఇరుముడితో వెళ్లిన స్వాములకే శబరిమల అయ్యప్ప ఆలయంలో 18 మెట్లూ ఎక్కే అర్హత ఉంటుంది.

ఒక్కోసారి ఒక్కో పేరుతో..

మొదటిసారి మాల వేసే కన్నెస్వాములంటే అయ్యప్ప స్వామికి ఇష్టం. అందుకే ఎక్కువ మంది కన్నెస్వాములతో మాల వేయించేందుకు గురుస్వాములు ఇష్టపడతారు. మొదటిసారి మాల ధరించిన స్వాములను కన్నె స్వాములు (బాణం గుర్తు), రెండోసారి కత్తి స్వాములు (కత్తి), మూడోసారి గంట స్వాములు (గంట), నాలుగోసారి గద స్వాములు (గద), ఐదోసారి పేరుస్వాములు (ధనస్సు), ఆరోసారి జ్యోతి స్వాములు (జ్యోతి), ఏడోసారి రవి స్వామి (సూర్యుడు), ఎనిమిదో సారి చంద్రస్వామి (చంద్రుడు), తొమ్మిదోసారి వేలాయుధ స్వామి (వేలాయుధం), పదోసారి విష్ణుస్వామి (చక్రం), పదకొండోసారి శంఖస్వామి (శంఖం), పన్నెండోసారి నాగస్వామి (పాము), పదమూడో సారి వేణుస్వామి (మురళి), పద్నాలుగోసారి పద్మస్వామి (కమలం), పదిహేనోసారి త్రిశూల స్వామి (త్రిశూలం), పదహారోసారి కొండ స్వామి (కొండ), పదిహేడోసారి ఓం స్వామి (ఓంకారం), పద్దెనిమిదో సారి గురుస్వామి (కొబ్బరిచెట్టు)గా పిలుస్తారు.

అలరించే పడిపూజ

దీక్షలో అయ్యప్పలు చేసే పడి పూజ ఆసక్తికరంగా ఉండి, ప్రతి ఒక్కరినీ ఆధ్యాత్మిక భావనకు గురి చేస్తుంది. ఈ పూజ కోసం అరటి బోదెలతో అయ్యప్ప స్వామి గుడి నిర్మించి పూలు, పండ్లతో అందంగా అలంకరిస్తారు. పడిపూజలో 9, 18, 36, 54, 108 కలశాలతో ఎవరి స్తోమతకు తగినట్టు వారు పూజలు చేస్తారు. పూజలో భాగంగా భజన అనంతరం హారతి వెలిగించి అయ్యప్ప భక్తులు పడి తొక్కుతారు. గురుస్వామి పాడే పడి పాటకు అనుగుణంగా స్వాములు పడి తొక్కే విధానం ఆకట్టుకుంటుంది.

రైల్వే, ఆర్టీసీకి దండిగా ఆదాయం

నవంబర్ నుంచి జనవరి నెల వరకు అయ్యప్ప స్వాములు జిల్లా నుంచి శబరిమలకు రైళ్లు, బస్సులలో వెళ్తుంటారు. దాదాపు 70 శాతం మంది రైళ్లలో వెళ్తున్నారు. తద్వారా రైల్వేకు సుమారు రూ.6.3 కోట్ల ఆదాయం వస్తోంది. ఆర్టీసీ బస్సులపై కూడా స్వాములు శబరిమల యాత్ర చేస్తున్నారు. గత ఏడాది జిల్లా నుంచి 20 బస్సులలో స్వాములు శబరిమల వెళ్లగా ఆర్టీసీకి రూ.30 లక్షల ఆదాయం సమకూరింది.

36వ సారి మాలధారణ



ఈ ఏడాది 36వసారి మాలధారణ చేశాను. ఏటా 50 మంది వరకూ భక్తులతో శబరిమల వెళ్లి స్వామి వారిని దర్శించుకుంటున్నాను. ఈ ఏడాది కూడా శబరిమలకు పయనమవుతున్నాను. క్రమశిక్షణ, ఆధ్యాత్మిక చింతన అయ్యప్ప మాలతో సాధ్యమవుతాయి.

– కర్రి ఆదినారాయణరెడ్డి, గురుస్వామి, సోమేశ్వరం, రాయవరం మండలం